ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.40 (310.2522)	37,116	44,191
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.40 (4.30)	4,082	4,082
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.93 (45.66)	33,728	36,963

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210

సన్నాలకు గండం

వాతావరణంలో మార్పులు వరి పంటకు శాపంగా పరిణమించాయి. వరి నాటిన దగ్గరి నుంచి తెగుళ్ల ఉధృతి అధికమైంది. ఎన్ని సస్యరక్షణ చర్యలు చేపట్టినా ప్రకృతి అనుకూలత లేకపోవడంతో పంట ఎదుగుదలలో సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ ఏడాది నీటి లభ్యత కారణంగా ఉమ్మడి జిల్లాలో 10.50లక్షల ఎకరాల్లో వరి సాగైంది.

- మిర్యాలగూడ (వ్యవసాయం)



పచ్చపురుగు ఆశించిన వరి పంట, (ఇన్‌సెట్లో) దోమ వ్యాపించిన వరి

- వరిలో ఉధృతంగా తెగుళ్ల వ్యాప్తి
- వాతావరణంలో మార్పులే కారణం
- పెరుగుతున్న పెట్టుబడులు
- ఆందోళనలో అన్నదాతలు
- సమగ్ర యాజమాన్యంతో ఫలితాలు

ప్రస్తుత వానాకాలంలో మొత్తం వరి విస్తీర్ణంలో 95శాతం సన్న రకాలు సాగయ్యాయి. వరుస భారీ వర్షాలు, ముసురుతోపాటు ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసాలు, ఉక్కపోత వంటి కారణాలతో వరి సాగులో ఇబ్బందులు ఎదురయ్యాయి. నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో జూన్‌లో నారు పోసుకుని జూలైలో నాటు వేసిన పొలాలు వర్షాలకు ఏపుగా పెరగడంతో దోమ వ్యాప్తి, బూడిద తెగులు (బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు) అధికమైంది. ఇప్పటికే రెండు నుంచి మూడుమార్లు ఖరీదైన పురుగు మందులు పిచికారీ చేసినా దోమవ్యాప్తి నియంత్రణలో రాలేదని రైతులు వాపోతున్నారు. దోమతో పాటు మొగిపురుగు ఆశించడంతో దిగుబడులపై ప్రభావం చూపే పరిస్థితి ఏర్పడింది. ఆగస్టు నెలలో ఆలస్యంగా సాగు చేసిన వరికి ప్రారంభం నుంచే పచ్చపురుగు ఆశించింది. ఆకును గీరి తినడంతో పచ్చగా మారింది. ఇప్పటి వరకు రెండు నుంచి మూడుమార్లు రైతులు పురుగు మందులు పిచికారీ చేశారు. సాధారణ రసాయనిక మందులు పని చేయకపోవడంతో కొత్త రకం, ఖరీదైనవి పిచికారీ చేస్తున్నారు. ధర అధికంగా ఉండటంతో ఎకరానికి సుమారు రూ.2,500 వరకు ఖర్చు వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వాతావరణం అనుకూలిస్తే తప్ప పంట చేతికొచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరిలో సమస్యలు అధికమయ్యాయి



నాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. నాటు దగ్గరి నుంచి తెగుళ్ల సమస్య అధికమైంది. ఆకుపచ్చపురుగు, బూడిద తెగులు, దోమ, మొగి వ్యాప్తితో పంట దెబ్బతింటోంది. సస్యరక్షణ చేపట్టాల్సి రావడంతో పెట్టుబడులు భారీగా పెరుగుతున్నాయి. దిగుబడులు ఆశించిన మేర వచ్చే పరిస్థితి కనపడటం లేదు.

- నాగేశ్వరరావు, రైతు, తుంగపాడు, మిర్యాలగూడ

అధికంగా పురుగు మందుల వాడకంతో నష్టం..

- సమగ్ర యాజమాన్య పద్ధతులు చేపట్టాలి
- డాక్టర్ లింగయ్య, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధనా స్థానం, కంపసాగర్ శాస్త్రవేత్త

రైతులు దశాబ్దకాలంగా సేంద్రీయ ఎరువులు వాడటం లేదు. పశువుల ఎరువుతో పాటు పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము పంటలు రైతులు సాగు చేయడం లేదు. కేవలం అడుగు పెండితో పాటు, నత్రజని ఎరువులు అధికంగా వాడటం వల్ల భూమిలో పోషక విలువలు తగ్గాయి. దీనికి తోడు వాతావరణంలో మార్పుల కారణంగా ప్రస్తుతం వరిలో తెగుళ్ల వ్యాప్తి అధికమైంది. రైతులు ఇష్టానుసారంగా మందులు పిచికారీ చేయకుండా సమగ్ర యాజమాన్య పద్ధతులు చేపడితే మంచి ఫలితాలు సాధించవచ్చు.

- వరి సన్న గింజ రకాల్లో ఆకు ఎండు తెగులు కనిపిస్తోంది. ఆకుల చివర పసుపు రంగు మచ్చలు అంచుల నుంచి కిందికి వ్యాపిస్తాయి. పసుపు రంగు చారలు, ఆకు ఒక వైపు లేదా రెండు వైపులా కనిపిస్తాయి.
- ఈ తెగులు తీవ్రంగా ఉన్నపుడు ఆకులు ఎండి గడ్డిలా కనిపిస్తాయి. » అధిక గాలి వేగం, చిరు జల్లులు, 22-26 డిగ్రీల ఉష్ణోగ్రత కారణంగా వరి నాట్లు ఒత్తుగా వేసిన పొలాల్లో తెగుళ్ల వ్యాప్తి అధికంగా ఉంటుంది.

నివారణ చర్యలు

- ఈ తెగులును పూర్తిగా నివారించే మందులు లేవు. అయితే తొలి దశలో కాపర్‌హైడ్రాక్సైడ్ 400గ్రా. ఎకరా



నికి, లేదా సైప్టోమైసిన్ సల్ఫేట్, టెట్రాసైక్లిన్ హైడ్రాక్లోరైడ్ 9:1ను 40గ్రా. ఎకరానికి పిచికారి చేయాలి.

దోమ పోటు

- దోమ ఉధృతి ఉంటే పంట దిగుబడులు తగ్గిపోతాయి. కంకిలోని గింజలు తాలుగా మారడం, గింజ నాణ్యత కోల్పోవడంతోపాటు గింజల్లో నూక శాతం ఎక్కువవుతుంది. » నత్రజని ఎరువులు అధికంగా వాడటం, అనవసరంగా రసాయనిక మందులు పిచికారీ చేయడం, బెట్టవాతావరణం, అధిక ఉష్ణోగ్రతల కారణంగా దోమ ఉధృతమవుతుంది.
- వరి దుబ్బుల మొదళ్ల దగ్గర ఆకులు ఎండి గడ్డిలాగ కనిపిస్తాయి. » సాధారణంగా ఈ దోమ ఉధృతి వానాకాలంలో అక్టోబరు-నవంబరులో, యాసంగిలో అయితే మార్చి-ఏప్రిల్ మాసాల్లో ఎక్కువగా కనిపిస్తుంది.
- దోమ వ్యాప్తి అధికంగా ఉంటే పైరు సుడులు సుడులుగా ఎండిపోతుంది.

నివారణ చర్యలు

- తొలి దశలో దోమ నివారణకు ఎసిఫేట్76 ఎస్‌పి 300గ్రా. ఎకరానికి, లేదా బ్యూప్రొఫెజిన్ 320మి.లీ ఎకరాకు, లేదా పైమెట్రాజైన్ 50 డబ్ల్యూజీ 100గ్రా. ఎకరానికి పిచికారి చేయాలి.

ఆకుచుట్టు పురుగు

- వాతావరణంలో అధిక తేమ, నత్రజని ఎరువుల వాడకం వల్ల ఈ పురుగు ఉధృతి అధికంగా ఉంటుంది.
- ఈ పురుగు పోటాకు దశలో ఎక్కువగా నష్టాన్ని కలుగజేస్తుంది. వానాకాలంలో ఈ పురుగు ఉధృతి అధికంగా ఉంటుంది. » లార్వాకు ఆకులను పొడవుగా గొట్టంలా మలచి ఆకుముడతలోఉండి పత్రహరితాన్ని గీరి తింటాయి.
- ఆకులను గీరి తినడం వల్ల తెల్లటి చారలు ఏర్పడతాయి. దూరం నుంచి ఆకులు తెల్లబడి కనిపిస్తాయి.

నివారణ చర్యలు

- కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400గ్రా. ఎకరానికి లేదా ఫ్లూబెండియమైడ్ 20డబ్ల్యు డీజీ 50గ్రా. ఎకరానికి, లేదా ఫ్లూబెండియమైడ్ 39.35 ఎస్.సి, 20మి.లీ ఎకరాకు పిచికారి చేయాలి.

కాండం తొలుచు పురుగు (మొగిపురుగు)

- పూత దశలో ఆశించినప్పుడు గొలుసు గింజలు మొత్తం తాలుగా మారి గొలుసు ఎండిపోయి తెల్లకంకిలా మారుతుంది. » చనిపోయిన మొగి, తెల్లకంకి లాగినపుడు తేలికగా ఊడి వస్తాయి.

నివారణ చర్యలు

- చిరు పొట్టదశలో ఎకరానికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్4జీ గుళికలు 8 కిలోలు, లేదా కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోలు వేయాలి. » పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400గ్రా. ఎకరానికి. లేదా క్లోరాన్‌ట్రనిలిప్రోల్ 60 మి.లీ ఎకరానికి పిచికారీ చేయాలి.

తెల్లబోతున్న పత్తి రైతు



మునుగోడులో ఎర్రబారిన పత్తి

- ముసురు ప్రభావంతో నిలవని పూత, పిందె
- చేతికొచ్చి తడిసి ముద్దవుతున్న తెల్లబంగారం
- చేలల్లో పదునుతో అధికమైన చీడపీడలు
- ఆకుముడతతో ఎర్రబారి ఎండుతున్న మొక్కలు

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ముసురు పత్తి రైతుల పాలిట శాపంగా మారింది. వాతావరణంలో మార్పులు, తేమ శాతం పెరగడంతో పత్తి చేలల్లో పదును తగ్గడం లేదు. ఫలితంగా రసం పీల్చే పురుగులు, పచ్చ, తెల్లదోమ, నల్లితో ఆకు ముడుత, పండాకు, ఎండాకు వంటి పలు తెగుళ్ల వ్యాప్తి అధికమైంది. పత్తి పూత,పిందె రాలిపోతుండటంతోపాటు కాయలు నల్లబారుతున్నాయి.చేతికొచ్చిన పత్తి తడిసి ముద్దవడంతో పాటు వేరుకుళ్లుతో దిగుబడిపై ప్రభావం చూపే పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా నల్లమట్టి చెల్కల్లో పదును ఆరని ప్రభావం అధికంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోతోందన్నారు.

- మునుగోడు

మునుగోడు నియోజకవర్గంలో 1,46,145 ఎకరాల విస్తీర్ణంలో రైతులు పత్తి సాగుచేశారు. వాతావరణం అనుకూలిస్తే సుమారు లక్ష మెట్రిక్ టన్నులకు పైగా పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఆరంభంలో అనుకూలంగా కురిసిన వర్షాలతో రైతులు ఎన్నో ఆశలతో పంటలు సాగుచేశారు. ఆ తరువాత వర్షాలు లేకపోవడం, తదనంతరం ఆలస్యంగా ముసురు వర్షాలు కురిశాయి. ముసురు కారణంగా చేలల్లో తేమ పెరిగింది. పదును ఆరక తెగుళ్ల వ్యాప్తి అధికమైంది. చీడపీడలతో పంట ఆకులు ఎర్రబారి నిలువునా ఎండుతున్నాయి. పూత, పిందె రాలిపోతోంది. పత్తి పూత, కాత దశలో రసం పీల్చు పురుగులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా తెగుళ్ల ఉధృతి అదుపులోకి రావడం లేదని, ఇప్పటికే వేల రూపాయల పెట్టుబడులు పెట్టామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పత్తి పూర్తిగా దెబ్బతిన్నది



నాకున్న నాలుగు ఎకరాల భూమిలో ఈ సీజన్‌లో పత్తి సాగు చేశా. తొలుత కురిసిన వర్షాలకు భూమిని సిద్ధం చేసి పత్తి విత్తనాలు విత్తా. ఇప్పటి వరకు మొత్తం లక్ష రూపాయలకు పైగా ఖర్చు వచ్చింది. గత వారంలో కురిసిన ముసురు వర్షానికి పంట పూర్తిగా ఎండిపోయింది. దీంతో పెట్టిన పెట్టుబడి వచ్చే అవకాశం లేదు. పూర్తిగా పంట దెబ్బతిని నష్టం వాటిల్లింది.

- బాలం నర్సింహ, రైతు, సోలిపురం

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



ఈ ఏడాది ఆరంభంలో అనుకూల పరిస్థితులు పత్తి సాగుచేశారు. మధ్యలో కొంత వర్షాలు తగ్గాయి. ఇటీవల ఆలస్యంగా వర్షాలు కురిశాయి. ముసురు వర్షాలకు నల్లితో పాటు రసంపీల్చే పురుగులు పెరిగాయి. వేరుకుళ్లు, ఎండు తెగులు ఆశించింది. కాత దశలో పూత, పిందె రాలింది. తెగుళ్లకు అక్కడక్కడ కొంత విస్తీర్ణంలో రైతులు నష్టపోయారు. ఈ సమస్యలను అధిగమించేందుకు రైతులకు ఇచ్చిన సలహాలు సూచనలను పాటించాలి. చేలల్లో వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. అవసరమైన మందులను అనువైన వాతావరణంలో పిచికారీ చేయాలి.

- బీ.వేణుగోపాల్, మునుగోడు ఏడీఏ

ఖర్చులు పెరిగి దిగుబడులు తగ్గుతున్నాయి



సీజన్ ఆరంభంలో వర్షాలు అనుకూలంగా కురిశాయి. నాలుగు ఎకరాలకు తోడు గ్రామంలో 20 ఎకరాలు కౌలుకు తీసుకొన్ని పత్తి విత్తనాలు విత్తా. ఆ తరువాత వర్షాలు తగ్గుముఖం పట్టాయి. ఇటీవల ఆలస్యంగా ముసురు వర్షాలు కురిశాయి. తెరిపి లేకుండా చినుకులు పడి పంట చేలల్లో నీరు పారకుండా పోయింది. నీరు నిలిచి భూమిలో తేమ శాతం పెరిగింది. పదును ఆరక పత్తి మొక్కలకు వేరుకుళ్లు, ఎండుతెగులు వ్యాపించాయి. మరోపక్క రసంపీల్చే పురుగుల ఉధృతి పెరిగింది. దీంతో పూత, పిందెలు పూర్తిగా రాలాయి. తొలకరి వర్షాలకు సాగు చేసిన పంటకు వచ్చిన కాయలు సైతం తడిసి రాలిపోయాయి. ఎన్ని మందులు కొట్టినా ఫలితం లేకుండా పోతోంది. పెట్టుబడులు పెరగ్గా, దిగుబడి మాత్రం పూర్తిగా తగ్గే అవకాశం ఉంది.

- కొంక శంకర్, రైతు, చల్మెడ

థర్డ్ జెండర్ క్లినిక్

- వారంలో రెండు రోజులు ఓపీ సేవలు
- జిల్లా కేంద్ర బోధనాస్పత్రుల్లో త్వరలో ప్రారంభం
- ఉమ్మడి జిల్లాలో 200 మంది ట్రాన్స్‌జెండర్లు

.7లో..



ఎంబీ.కెనాల్ ఎస్కేప్ నుంచి

బూరుగడ్డ చెరువుకు భారీగా వరద

- గోపాలపురం-బూరుగడ్డ మధ్య నిలిచిన రాకపోకలు
- రహదారికి గండిపెట్టిన వైనం

మండల పరిధిలోని గోపాలపురం-బూరుగడ్డ గ్రామాల మధ్య మళ్లీ రాకపోకలు నిలిచిపోయాయి. శనివారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో పాటు ఎంబీ కెనాల్‌కు 14వ కిలోమీటర్ వద్ద బూరుగడ్డ ఎస్కేప్‌ను ఎత్తడంతో భారీగా వరద బూరుగడ్డ నల్లచెరువుకు వచ్చి చేరింది. దీంతో రెండోసారి బూరుగడ్డ రహదారికి గండి పెట్టారు.

- హుజూర్‌నగర్

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బూరుగడ్డ గ్రామంలోని నల్లచెరువు శివాలయం వద్ద గండి పడి రోడ్డు కొట్టుకుపోయింది. కొద్ది రోజుల క్రితం చెరువుకట్ట మరమ్మతులతోపాటు వరదలో కొట్టుకుపోయిన రోడ్డును పునర్నిర్మించి గ్రామాల మధ్య రాకపోకలను పునరుద్ధరించారు. ఇదిలా ఉండగా శనివారం కురిసిన భారీ వర్షానికి చెరువు నిండగా కట్టతెగిపోయే ప్రమాదం ఏర్పడింది. దీనికితోడు ఎంబీ.కెనాల్‌కు ఉన్న ఎస్కేప్‌ను లేపడంతో బూరుగడ్డచెరువుకు వరద భారీ మొత్తంలో వచ్చి చేరింది. ఓ వైపు వర్షం, మరోవైపు ఎస్కేప్ నుంచి భారీగా వరద రావడంతో బూరుగడ్డ చెరువు నిండి తెగిపోయే ప్రమాదం ఏర్పడటంతో స్థానికులు రహదారికి గండికొట్టారు. దీంతో చెరువుకట్ట పనులకు ఆటంకం కలగడంతో పాటు గతంలో రోడ్డుకు వేసిన గూనల్లోని రాళ్లు కొట్టుకుపోయాయి. ఫలితంగా కరక్కాయలగూడెం, బూరుగడ్డ, మాచవరం గ్రామాల నుంచి గోపాలపురం, హుజూర్‌నగర్‌కు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రోడ్డుకు గండికొట్టడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు. ఇదిలా ఉండగా, భారీ వర్షాలతో నల్లచెరువు తెగిపోవడంతో బూరుగడ్డలోని సుమారు 500ఎకరాల పంట నష్టం జరిగింది. ఇసుక మేటలు వేసి పంట పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఓవైపు చెరువు కట్ట, మరో వైపు రోడ్డు ధ్వంసమైంది. బూరుగడ్డ రోడ్డును, తెగిపడ్డ చెరువును మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ తేజస్‌నందాలాల్, కేంద్ర బృందం సభ్యులు సైతం పరిశీలించారు. అయితే కేంద్రం నుంచి ఒక్క రూపాయి సాయం విడుదల కాలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



బూరుగడ్డ-గోపాలపురం మధ్య రోడ్డుకు పెట్టిన గండి ద్వారా వెళుతున్న వరద నీరు



బాధితులకు అండగా ఉండటం

అభినందనీయం

బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కోదాడ రూరల్, సెప్టెంబరు 22: వరద బాధితులకు స్వేరోస్ అండగా ఉండటం అభినందనీయమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని కూచిపూడి, తొగర్రాయి గ్రామాల్లో ఇటీవల వరదలతో నష్టపోయిన కుటుంబాలకు ఆదివారం స్వేరోస్ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వేరోస్ సొంత ఖర్చులతో బాధితులకు అండగా నిలవడం ఎంతో అభినందనీయమన్నారు. దాతృత్వ గుణాన్ని కలిగి సహకరించడం స్వేరోస్ లక్షణాల్లో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో స్వేరోస్ నెట్‌వర్క్ వైస్‌చైర్మన్ బాలప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు చిలకబత్తిని వీరన్న, చెరుకుపల్లి కిరణ్, మచ్చా నర్సయ్య, షైలారం జగన్, వీరస్వామి, నాగార్జున, లక్ష్మణ్, సునిత, కనకతార, పద్మ, ధనమ్మ, అంబేడ్కర్, శాంసన్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో: మండల పరిధిలోని కూచిపూడి గ్రామంలో వరద బాధితులకు కాంగ్రెస్ నాయకులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు ఇర్ల సీతారాంరెడ్డి, రేపూరి వెంకటాచారి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, శరభయ్య, రెడ్డిపూడి అనంతరామయ్య, శెట్టి పూర్ణచందర్‌రావు, శెట్టి నాంచారయ్య, డైరెక్టర్ శెట్టి శ్రీనివాసరావు, చేప తిరపయ్య, చేతుల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా నృసింహుడి కల్యాణం

మఠంపల్లి, సెప్టెంబరు 22: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మట్టపల్లి లక్ష్మీ నృసింహుడి క్షేత్రంలో రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి, సమేత స్వామివారి నిత్యకల్యాణాన్ని వేదపండితులు సంప్రదాయబద్ధంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తవత్సలుడికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. అనంతరం ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం హోమాధికాలు భక్తిశ్రద్ధలతో చేశారు. కల్యాణ మూర్తులను పరిణయోత్సవ వేదికపైకి అధిష్ఠింపజేసి పుణ్యాహావాచనం,పాదప్రక్షాళన మధుపర్క పూజలు నిర్వహించారు. అనంతరం మాంగళ్యధారణ, యజ్ఞోపవీత ధారణ, దివ్యమూర్తులకు గరుడోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేష పర్వాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయచార్యులు, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ తంతు నిర్వహిస్తున్న వేదపండితులు

ఘనంగా ముత్యాలమ్మ పండుగ

మండలంలోని చెన్నాయిపాలెం గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ పండగను గిరిజనులు వారి సంప్రదాయం ప్రకారం నిర్వహించారు. ఉదయం అమ్మవార్లకు జలాభిషేకం చేశారు. మహిళలు ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని మొక్కు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ సభ్యురాలు భూక్య నీల, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంజూనాయక్, మాజీ సర్పంచులు భరత్, మారోణి, నాగునాయక్, మాజీ ఎంపీటీసీలు జ్యోతి, అశోక్‌నాయక్, నాయకులు రవీందర్, ఈశ్వర్‌నాయక్, పున్నానాయక్, లోకనాథం, గోవర్ధన్, మాలోతు నాగేశ్వరావునాయక్, తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణ క్షేత్రంలో పూజలు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామ సమీపంలోని అఖండ జ్యోతిస్వరూప శ్రీసూర్యనారాయణ క్షేత్రంలో ఆదివారం తెల్లవారుజాము మహా సౌరహోమం నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, అన్నదానం చేశారు. క్షేత్రంలో 200మంది గ్రామీణ అర్చకులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమాల్లో క్షేత్ర వ్యవస్థాపకులు జనార్ధనస్వామి, గణపురపు నరేష్, జాగరణ సమితి నిర్వాహకులు లక్ష్మీనర్సింహస్వామి, వెంకటేశ్వరశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పుల్లయ్యగౌడ్

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 22: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాటకరంగ కళాకారులను ఆదుకోవాలని తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు గిలకత్తుల పుల్లయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజాన్ని చైతన్యపరచడంలో కళాకారులు ముందువరుసలో ఉన్నారన్నారు. ప్రస్తుతం నాటక కళాకారులకు ఆదరణలేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని ఆవేదనవ్యక్తం చేశారు.

భావితరాలకు నాటకాలపై ఆదరణ పెరిగేలా ప్రభుత్వం కళాకారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, రాజకీయాలకు అతీతంగా కళాకారులకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని, వృద్ధ కళాకారులకు పింఛన్ అందజేయాలని, జిల్లా కేంద్రంలో కళాకారుల భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. త్వరలో గ్రామ, పట్టణ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కళాకారులు ఐక్యంగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గుండు వెంకటేశ్వర్లుగౌడ్, సంగమేశ్వర్‌ప్రసాద్, తాడూరు లింగయ్య, సాముల మట్టారెడ్డి, బాసంపల్లి యాదగిరి, రాంబా బు, దాచెపల్లి లక్ష్మి, బోగాల సంజీవరెడ్డి, ధనియాకుల వెంకటేశ్వర్లు, ముల్క సునీతరెడ్డి, కోలపూడి వెంకయ్య, పెద్దకాశయ్య, నాగలక్ష్మి, భార్గవ్‌శర్మ, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ పర్యాటక శాఖ, హైదరాబాద్ బైక్ రైడర్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన బుద్ధవనం నిర్వాణ ద్విచక్ర వాహన ర్యాలీ ఆదివారం మధ్యాహ్నం సాగర్ బుద్ధవనానికి చేరుకుంది. వారికి ఒగ్గు కథ కళాకారులతో సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు




బుద్ధవనం వద్ద ఒగ్గు కళాకారులు

సాగర్‌లో సందడి



బుద్ధవనానికి చేరుకున్న బైక్ రైడర్లు

కరగని విగ్రహం... నెరవేరని లక్ష్యం..



నల్లగొండ పట్టణంలోని వల్లభరావు చెరువులో నిమజ్జనం చేయడంతో కరిగిపోయిన మట్టి విగ్రహం



నీటిలో కరగకుండా అలాగే ఉన్న ప్రతిమ

వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నా నిర్వాహకులు ఎక్కువగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతోనే ఉత్సవాలను నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన నిమజ్జనంలో మట్టి విగ్రహాలు కరిగిపోగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారుచేసిన విగ్రహాలు నీటిలో కరిగిపోకుండా అలానే ఉన్నాయి. దీంతో వాతావరణంతో పాటు నీటి కాలుష్యం జరుగుతుందని పర్యావరణవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

భక్తుల సందడి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరిఅర్బన్, సెప్టెంబరు 22: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ప్రధానాలయం, ఉత్తర ప్రాకార మండపం, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాల వద్ద భక్తుల సందడి నెలకొంది. ఆలయ ఉత్తర దిశలో భక్తులు షెడ్డు కింద సేద తీరారు. అదే విధంగా భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. సుప్రభాత సేవతో స్వామి, అమ్మవారిని మేల్కొపిన అర్చకులు స్వయంభువులకు సంప్రదాయరీతిలో నిత్యపూజలు నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా నిర్వహించారు. పాతగుట్టలో స్వామి అమ్మవారికి నిత్య పూజలు ఘన ంగా నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో నిర్వహించారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు. 25వేల మంది లక్ష్మీనృసింహుడిని దర్శించుకోగా, రూ.30,75, 287ల ఆదాయం ఆలయ ఖజానాకు సమకూరింది. ధర్మదర్శనానికి గంట సమయం, వీఐపీ టికెట్(రూ.150) దర్శనానికి అరగంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు.



ఆలయ ఆవరణలో భక్తుల సందడి

నిలకడగా సాగర్ నీటి మట్టం



నిండుకుండను తలపిస్తున్న నాగార్జునసాగర్ జలాశయం

నాగార్జునసాగర్, మేళ్లచెర్వు, కేతేపల్లి, సెప్టెంబరు 22: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 589.40 అడుగులుగా ఉంది. ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,116 కూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 10350 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 2818 కూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,623 కూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 కూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కులు మొత్తంగా, 44,191 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు)కాగా 589.40 అడుగులుగా(310.2522 టీఎంసీలు) ఉంది.

'పులిచింతల' ఒక గేటు నుంచి నీటి విడుదల

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టుకు ఎగువనుంచి 33,728 క్యూసెక్కుల వరద వస్తుండటంతో ఒక గేటు నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు (45.77 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 174.93 అడుగులు (45.66టీఎంసీలు)గా ఉంది. ఈ నెల 20వ తేదీ నుంచి ఒక గేటు నుంచి నీటి విడుదల కొనసాగిస్తుండగా, ఆదివారం ప్రాజెక్టు ఒక గేటు నుంచి 20,963 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 107 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తూ మొత్తం 36,963 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

'మూసీ'కి 4,082 క్యూసెక్కుల వరద

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురియడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మూసీ రిజర్వాయర్‌కు ఆదివారం సాయంత్రం 4,082 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. 645 అడుగుల (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం ఉన్న మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 644.40 అడుగులు (4.30 టీఎంసీలు)గా ఉంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు సాగునీటి విడుదల కొనసాగుతోంది. కుడికాల్వకు 122 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 268 క్యూసెక్కుల చొప్పున ఆయకట్టుకు రెండో విడత సాగునీటిని విడుదల చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

వలిగొండ, సెప్టెంబరు 22: యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రానికి చెందిన వ్యక్తి ఆదివారం అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బాలగోని మాదవ్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. చుట్టుపక్కల వెతికినా బంధువులకు ఫోన్ చేసినా సమాచారం లభించలేదు. భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి


ఐలయ్య(ఫైల్)

భువనగిరి రూరల్, సెప్టెంబరు 22: యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం రాయిగిరి శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. రూరల్ ఎస్ఐ వి. సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజపేట మండలం కుర్రారం గ్రామానికి చెందిన జూకంటి ఐలయ్య(47) తన బావ రాగుల బీరయ్యతో కలిసి మోటారు సైకిల్‌పై ఈ నెల 21న హైదరా బాద్‌లోని వారి బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం తిరిగి బైక్‌పై వస్తుండగా రాయిగిరి శివారులోని మాసుకుంట వద్ద వెనుక నుంచి అతివేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న ఐలయ్య తీవ్రంగా గాయపడ్డాడు. వెనుక కూర్చున్న బావ బీరయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. స్థాని కులు గమనించి 108అంబులెన్స్‌లో క్షతగాత్రులను జిల్లాకేంద్రంలోని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. డ్యూటీ డాక్టర్ పరీక్షించగా ఐలయ్య అప్పటికే మృతిచెందాడని ధ్రువీకరించారు. స్వల్పంగా గాయపడిన బీరయ్యకు చికిత్స అందించారు. ఐలయ్య భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్వగ్రామానికి వస్తుండగా...


మహేష్(ఫైల్)

వేములపల్లి: నల్లగొండ జిల్లా వేములపల్లి మండ లంలోని శెట్టిపాలెం గ్రామానికి చెందిన నిమ్మల మహేష్ (32) కొద్ది రోజులుగా మిర్యాలగూడ పట్టణంలోని రామ చంద్రగూడెంలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం తన స్వగ్రామమైన శెట్టిపాలెంకు వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుండగా శెట్టిపాలెం శివారులోని మహాతేజ రైస్ సమీ పంలోకి రాగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపో యింది. మహేష్ సమీపంలోని వరి పొలాల్లో పడగా గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకొని మహేష్‌ను మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు మహేష్‌కు చికిత్స అందిస్తుండగానే మృతిచెందా డు. మహేష్‌కు భార్య మహేశ్వరి, కూతురు హని, కుమారుడు ఆర్యన్ ఉన్నారు.

9నెలలు కోమాలోకి వెళ్లి..


మోసిన్‌పాషా(ఫైల్)

అడ్డగూడూరు, సెప్టెంబరు 22; రోడ్డు ప్రమా దానికి గురై చికిత్స పొందుతూ జూనియర్ లైన్‌మెన్ మృతిచెందాడు. ఈ సంఘటన యాద్రాద్రి భువనగిరి జిల్లా, అడ్డగూడూరు మండలంలోని చిర్రగూడూరులో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకా రం.. మండలంలోని చిర్రగూడూరు గ్రామానికి చెందిన షేక్ ఖాదర్, పార్విన్ సుల్తాన్‌ల కుమారుడు షేక్ మోసిన్‌పాషా(27) మండలంలోని లక్ష్మీదేవికాల్వ గ్రామం లో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తుండగా సుమారుగా తొమ్మిది నెలల క్రితం బైక్‌పై భువనగిరి వెళ్లి తిరిగి చిర్రగూడూరు వస్తున్న క్రమంలో భువనగిరి- మోత్కూరు ప్రధాన రోడ్డుపై మార్గమధ్యలో రోడ్డుపై ప్రమాదానికి గురయ్యాడు. అప్పటి నుంచి కోమాలోకి వెళ్లిన మోసిన్ పాషా హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో కొన్ని నెలలపాటు చికిత్స పొందాడు. అక్కడి నుంచి ఇటీవల సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు.

మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వలిగొండ, సెప్టెంబరు 22: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలకేంద్రంలో ఆదివారం పట్టుకు న్నారు. ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... భువనగిరి మండలం నూరెపల్లికి చెందిన ముదావత్ రెడ్యా, రెడ్డినాయక్‌తండాకు చెందిన భూక్యా శ్రీను, ద్విచక్ర వాహనాలపై మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా మండలకేంద్రంలో పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రామీణ వైద్యుడిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

మునగాల, సెప్టెంబరు 22: మండలకేంద్రానికి చెందిన గ్రామీణ వైద్యుడు నిర్లక్ష్యంతో తాను అనారోగ్యానికి గురయ్యానని సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని తాడ్వాయి గ్రామానికి చెందిన లొడంగి నర్సయ్య ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నర్సయ్యకు ఇటీవల జ్వారం రావడంతో మండలకేంద్రంలో ఉన్న గ్రామీణ వైద్యుడు చంద్రమౌళిని సంప్రదించానని, ఆయన తనకు ఒక ఇంజక్షన్ వేయటంతో తన కాలు పడిపోయిందని తెలిపారు. దీంతో తాను హైదరాబాద్‌లో చికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నాడు. నిర్లక్ష్యంతో వైద్యం చేసిన గ్రామీణ వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు డిమాండ్ చేశాడు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య

ఆత్మకూరు(ఎం) సెప్టెంబరు 22: ఆర్థిక ఇబ్బందులు తాళలేక గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మం డలంలోని రహీంఖాన్‌పేటలో ఆదివారం జరిగింది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ముత్యాలకుమార్(40) కొన్ని నెలలుగా మండలకేంద్రంలో భోజనం హోటల్ నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులను తాళలేక ఈ నెల 15వ తేదీన ఇంట్లోనే గడ్డి మందు తాగి ఆత్మహ త్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు ముత్యాలకుమార్‌ను హైద రాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ముత్యాలకుమార్ బాబాయి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

వంట చేస్తూ కుప్పకూలి..

రామన్నపేట, సెప్టెంబరు 22: వంట చేస్తూ కుప్పకూలి ఓ మహిళ గుండెపోటుతో మృతిచెందింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని జనంపల్లిలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన గట్టు రాములు, అరుణ(35) భార్యాభర్తలు. రాములు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రాములు డ్రైవర్ వత్తిలో భాగంగా వైజాక్ వెళ్లాడు. ఆదివారం ఇంట్లో తన ఇంట్లో పని చేస్తూ అరుణ(35) ఒకేసారి కుప్ప కూలిపోయింది. ఈ విషయం తెలిసిన వెంటనే ఇంటి పక్కన ఉన్న వారు చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించగా అరుణ అప్పటికే మృతిచెందినట్లు ప్రకటించారు. అరుణ మేనమామ జిట్ట శేఖర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మృతిపై ఎలాంటి అనుమానం లేదని చెప్పడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

అవినీతి రహిత రాజకీయాలే టీజేఎస్ లక్ష్యం

చివ్వెంల, సెప్టెంబరు 22: అవినీతి రహిత రాజకీయాలే తెలంగాణ జనస మితి పార్టీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ అన్నారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలకేంద్రంలో ఆదివారం జరిగిన పార్టీ ప్లీనరీలో ఆయన మాట్లాడారు. అక్రమ మార్గాల్లో డబ్బులు సంపాదించి ఎన్నికల్లో ఖర్చు చేస్తూ డబ్బుల సంపాదనే లక్ష్యంగా పనిచేస్తున్న రాజకీయ నాయకత్వాన్ని తీసివే యాలన్నారు. చట్టసభల్లో యువత క్రియాశీలకంగా ఉండేలా ప్రయత్నించాల న్నారు. అనంతరం జనజమితి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్య క్షుడిగా దరావత్ సుమన్‌నాయక్, ఉపాధ్యక్షుడిగా బల్గూరి గోపి, కార్యదర్శిగా జగ న్‌యాదవ్, రైతుజనసమితి మండల అధ్యక్షులుగా మల్సూర్‌నాయక్, యువజన సమితి మండల అధ్యక్షుడిగా రెడ్యానాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గట్ల రమాశంకర్, కిరణ్‌కుమార్, వీరయ్య, ప్రశాంత్, గోపి, చంద్రకాం త్, వీరేష్, సత్యనారాయణ, బచ్చలకూరి గోపి, యాకుబ్‌రెడ్డి, సైదానాయక్, మధు సూధన్‌రెడ్డి, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పట్టు తప్పిందా పని గోవిందా



నల్లగొండ డిపో నుంచి మిర్యాలగూడెం వెళ్లడానికి విద్యార్థులు నానా అగచాట్లు పడుతున్నారు. బస్సులో ప్రయాణికులు కిక్కిరిపోవడంతో విద్యార్థులు ఫుట్‌పాత్‌పై నిలబడి, వేలాడుతూ ప్రయణిస్తున్నారు. పట్టు తప్పితే ప్రమాదం బారిన పడతారని ఆందోళన వ్యక్తమవుతోంది.

● స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ.

థర్డ్ జెండర్ క్లినిక్


యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మైత్రి ట్రాన్స్ క్లినిక్

- వారంలో రెండు రోజులు ఓపీ సేవలు
- భోదనాస్పత్రుల్లో త్వరలో ప్రారంభం
- ఉమ్మడి జిల్లాలో 200 మంది ట్రాన్స్‌జెండర్లు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 22: ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో పురుషులు, మహిళల కోసం వైద్యులు సేవలందిస్తున్నారు. ఇదే తరహా ట్రాన్స్‌జెండ ర్ల కోసం ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాకేంద్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక వైద్య విభాగాలు ఏర్పాటు చేసివారికి సేవలు అందించనున్నారు. జిల్లాకేం ద్రాల్లోని బోధనాసుపత్రులకు అనుబంధంగా ఉన్న ఆస్పత్రుల్లో క్లినిక్‌లు ఏర్పాటు చేయనున్నారు. ట్రాన్స్‌జెండర్లు కూటమిగా ఏర్పడి యాచక వృత్తి చేస్తూ జీవనం సాగిస్తుంటారు. మారుతున్న పరిస్థి తుల నేపథ్యంలో పలువురు ట్రాన్స్‌జెండర్లు రాజకీ యాల్లో కూడా చురుకైన పాత్ర పోషించడంతో పాటు ఆర్థిక కార్యకలాపాలు కూడా నిర్వహిస్తున్నారు. కాని అధికమంది ట్రాన్స్‌జెండర్లు సామాజిక వివక్షకు గుర వుతూ దుర్లభమైన జీవితాలు గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌జెండర్ల సంరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్ల హక్కుల పరిరక్షణ చట్టం-2019 ని అమలుల్లోకి తెచ్చింది. చట్టంలో భాగంగా ట్రాన్స్‌జెండర్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జిల్లా ఆస్పత్రుల్లో మైత్రి ట్రాన్స్ క్లిని క్‌లు ఏర్పాటు చేయనుంది. భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట జిల్లా ఆస్పత్రుల్లో త్వరలో ట్రాన్స్ క్లినిక్‌లు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఉమ్మడి జిల్లాలో సుమారు 200మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. రికార్డుల్లో లేని వారి మరికొందరు ఉంటారని అధికారులు భావిస్తున్నారు.

వారంలో రెండు రోజులు ఓపీ సేవలు

సామాన్య ప్రజలతోపాటు ట్రాన్స్‌జెండర్లకు పలు ఆరోగ్య సమస్యలు ఉత్పన్న మావుతుంటాయి. కాని అందరిలా వారు ఆస్పత్రులకు వెళ్లలేని పరిస్థితి. పైగా ట్రాన్స్ జెండర్లలో భిన్నమైన ఆరోగ్యసమస్యలు ఎదు రవు తుంటాయి. దీంతో ఆ వర్గానికి వైద్య చికిత్స అందించేందుకు మెజార్టీ వైద్యులు నిరాసక్తి చూపు తుంటారు. ఈ నేపథ్యంలో జిల్లా ఆసుపత్రుల్లో ప్రత్యేక గదిలో సమాన గౌరవం, సమగ్ర వైద్యం పేరిట మైత్రి ట్రాన్స్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి మంగళ, గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పనిచేస్తాయి.

వైద్య ఆరోగ్య శాఖాల పర్యవేక్షణ

ఆరోగ్యఆరోగ్యయేతర సమస్యలపై కౌన్సిలింగ్, లింగఆధారిత, సాధారణ ఆరోగ్య, సామాజిక అర్హత, క్లినిక్,ల్యాబ్ సేవలు, లైంగికంగా సంక్రమించే వ్యాధు లకు చికిత్సమందులు అందిస్తారు.అలాగే చర్మ వ్యా ధులు, సైకియాట్రిస్ట్ విభాగాల్లో ప్రత్యేక ఓపీ సేవ లు అందిస్తారు.దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ వ్యక్తుల సాధికారత, వైద్య ఆరోగ్య శాఖాలు ట్రాన్స్ క్లినిక్‌లు పర్యవేక్షిస్తాయి. మైత్రి ట్రాన్స్ క్లిని క్‌ల నిర్వహణకు ప్రత్యేక వైద్యులు, సిబ్బంది నియా మకాలు లేదా జిల్లా ఆసుపత్రుల్లోని ప్రస్తుత వ్యవస్థ ద్వారానే వైద్య సేవలు అందించడంపై త్వరలో స్పష్టత రానుంది. అలాగే ట్రాన్స్‌జెండర్లు తమ సమస్యలపై హెల్ప్‌లైన్ నెంబరు 155326కు ఫోన్ చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

మా ఆరోగ్య సమస్యలు తీరనున్నాయి



మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ల ఏర్పాటుతో ట్రాన్స్‌జెండర్ల ఆరోగ్య సమస్యలు తీర నున్నాయి. అందరికి భిన్నంగా తలెత్తే ఆరోగ్య సమస్యలపై ఆసుపత్రులకు వెళ్లలేక, వైద్య చికిత్సలు పొందలేక పలువురి ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయి. ట్రాన్స్ జెండర్లకు అందించే వైద్య చికిత్సలు, మందులు సాధారణ ఆసు పత్రుల్లో లభించలేని పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం ప్రారంభిస్తున్న ట్రాన్స్ క్లినిక్‌లు ఉపయోగ పడుతాయి. అంతేకాక మేము గౌరవప్రదంగా ఆసుప త్రులకు వెళ్లే పరిస్థితి ఉంటుంది. ట్రాన్స్ జెండర్లం దరూ ట్రాన్స్ క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోవాలి.

- నందిని, ట్రాన్స్‌జెండర్, నల్లగొండ.

'మూసీ' వరదలో చిక్కుకున్న పశువుల కాపరులు

● అప్రమత్తం చేయడంలో అధికారుల నిర్లక్ష్యం ● గేట్లు ఎత్తిన సమాచారం తెలియని భీమారం గ్రామస్థులు ● పశువులు మేపేందుకు, ఇసుక ఎత్తేందుకు వెళ్లిన స్థానికులు



భీమారం గ్రామంలో మూసీ నదిలో చిక్కుకున్న వారిని ఎక్స్‌కవేటర్‌తో బయటికి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న అధికారులు, బయటికి వచ్చిన బాధితులు

కేతేపల్లి, సెప్టెంబరు 22: మూసీ ప్రాజెక్టు గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు వదలడంతో పశువులను మేపేందుకు వెళ్లిన ఇద్దరు వరదలో చిక్కుకుపోయారు. చుట్టూ నీరు చేరడంతో సమీపంలో ఉన్న బండలపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం భీమారం గ్రామంలో ఈ సంఘటన జరిగింది. నీటి విడుదలను నిలిపివేయించిన పోలీసులు నాలుగు గంటల అనంతరం వారిని క్షేమంగా బయటకు తీసుకువచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మూసీ నది ఎగువ పరీవాహక ప్రాంతాల్లో శుక్ర వారం రాత్రి, శనివారం వర్షాలు కురవడంతో వరద నీరు దిగువకు వచ్చి ప్రాజెక్టులో చేరింది. శుక్రవారం సాయంత్రం 207క్యూసెక్కులుగా నమో దైన ఇన్‌ఫ్లో శనివారం సాయంత్రానికి 1825క్యూసెక్కులుగా నమోదైంది.

వరద ఉధృతి పెరగటంతో మూడు గేట్ల ఎత్తివేత

ఆదివారం తెల్లవారుజామున ఎగువనుంచి 4వేల క్యూసెక్కుల వరద వస్తుండటంతో ప్రాజెక్టు అధికారులు మొత్తం 20గేట్లలో మూడు గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 4వేల క్యూసెక్కుల నీటిని దిగువ మూసీకి విడుదల చేశారు. గేట్లు ఎత్తడంపై మూసీ పరివాహక ప్రాంత గ్రామ ప్రజలను అధికారులు అప్రమత్తం చేయకపోవడంతో వా రికి సమాచారం తెలియలేదు. భీమారం గ్రామానికి చెందిన సురుగు బాలస్వామి, బయ్య గంగయ్య తమ ఐదు ఆవులు, 15గేదెలను మూసీ నది ఒడ్డున మేపిన అనంతరం మధ్యాహ్నం సమయంలో మూసీ నది నీటిలోకి తీసుకెళ్లారు. ఆరుగురు కూలీలు కూడా ఇసుక తీసేందుకు ట్రాక్టరుతో నదిలోకి వెళ్లారు.

గేట్లు ఎత్తిన విషయం తెలియక అవస్థలు

తెల్లవారుజామున గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయటంతో ఆ వరద మధ్యాహ్న సమయానికి 35కిలోమీటర్ల దూరంలో ఉన్న భీమారం గ్రామం వద్దకు చేరింది. ఇది గమనించి అప్రమత్తమయ్యేలోపే వరద నీరు పశువుల కాపరులు బాలస్వామి, గంగయ్య, మూగజీవాలను చుట్టు ముట్టింది. నీటి ఉధృతిని చూసి ఇసుక ఎత్తేందుకు వచ్చిన ఆరుగురు కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్ పజ్జూరి గోపి సహా బయటకు వెళ్లగా ట్రాక్టర్ నీటిలో మునిగింది. కొన్ని పశువులు బండరాయిపైకి వెళ్లగా, మరికొన్ని బయటకు వెళ్లిపోవడంతో పశువుల కాపరులు బాలస్వామి, గంగయ్యలు నది మధ్యలోని బండరాయిపైకి చేరుకున్నారు. అప్పటికే ఐదు అడుగుల మేర నీరు వారి చుట్టూ చేరింది.

నాలుగు గంటల సహాయక చర్యలు

మూసీ వరదలో పశువుల కాపరులు, మూగజీవాలు చిక్కుకున్న సమా చారం తెలుసుకున్న కేతేపల్లి ఎస్ఐ శివతేజగౌడ్ పరిస్థితిని సమీక్షించి మూసీ అధికారులతో మాట్లాడి ప్రాజెక్టు గేట్లను మూసివేయించారు. స్థాని కంగా ఉన్న ఎక్స్‌కవేటర్‌ను తెప్పించి నీటిలో చిక్కుకున్న వారిని బయటకు తీసుకువచ్చే యత్నాలు ప్రారంభించారు. వీరి యత్నాలు ఫలించకపోవ డంతో సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి అగ్నిమాపక సిబ్బందిని రప్పిం చారు. అగ్నిమాపక శాఖ అధికారి జానయ్య నేతృత్వంలో సిబ్బంది తాళ్ల సాయంతో సాయంత్రం ఆరు గంటల సమయంలో ఇరువురు పశువుల కాపరులను క్షేమంగా బయటకు తీసుకు వచ్చారు. ముందస్తు సమా చారం లేకుండా దిగువకు భారీగా నీటి వదలడంపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంఘటనా స్థలం వద్ద శాలిగౌరారం సీఐ కె.కొండల్ రెడ్డి, నకిరేకల్ పట్టణ సీఐ రాజశేఖర్, నల్లగొండ ఇన్‌చార్జి ఆర్డీవో వి.శ్రీదేవి, మూసీ డీఈ చంద్రశేఖర్, కేతేపల్లి తహసీల్దార్ ఎస్.మధుసూదన్‌రెడ్డిలు సహాయక చర్యలను పర్యవేక్షించారు.

రాత్రి వేళ గేట్లు ఎత్తివేత

ఎగువనుంచి నాలుగువేల క్యూసెక్కులు వస్తుండటం, ప్రాజెక్టు గరిష్ఠ స్థాయి నీటిమట్టానికి(645అడుగులు, 4.46టీఎంసీలు) చేరువలో ఉండటంతో రాత్రి వేళ గేట్లు ఎత్తనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం 644.40 అడుగుల (4.30 టీఎంసీలు) నీటిమట్టం నమోదైంది.

టీపీఆర్టీయూ సమావేశం రసాభాస

● జిల్లా అధ్యక్షుడి ఎన్నికను విభేదించిన టీచర్లు ● వాగ్వాదం, తోపులాట, గల్లా పట్టుకునే వరకు పరిస్థితి


రాష్ట్ర నాయకత్వం ముందు నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నల్లగొండ, సెప్టెంబరు 22: నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహిం చిన పీఆర్‌టీయూ(టీఎస్) జిల్లా సర్వసభ్య సమావేశం రసభాసగా మారింది. జిల్లా నూతన కమిటీని ఎన్నుకునేందుకు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి టీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి హాజరయ్యారు. జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు శనివారం జిల్లాలోని 33 మండలా లకు చెందిన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం ఏర్పాటుచేసి అభిప్రాయాలు సేకరించారు. పీఆర్టీయూ జిల్లా నేత మేకల జానారెడ్డికి అధ్యక్షుడిగా, కార్యదర్శి పదవి ఇచ్చినా తమకు అభ్యంతరం లేదని రాష్ట్ర నాయకులకు అన్ని మండల కమిటీలు స్పష్టం చేసినట్లు తెలి సింది. అయినా జిల్లా అధ్యక్షుడి విషయంలో ఏకాభిప్రాయం రాలేదు. ఇప్పటివరకు జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్న ఫణికుమార్‌కు కొంతమంది మద్దతు ఇవ్వగా మరికొంతమంది మేకల జానారెడ్డికి మద్దతు ఇచ్చినట్లు తెలిసింది. ఫణికుమార్‌కు పూర్తి స్థాయిలో మద్దతు దొరకలేదు. ఆదివారం జరిగిన సమావేశంలో రాష్ట్ర నాయకత్వం ఫణికుమార్‌ను అధ్యక్షుడిగా, కార్యదర్శిగా మేకల జానారెడ్డిని ప్రకటించింది. ఫణికుమార్‌ను ప్రకటించ డంపై టీపీఆర్టీయూ జిల్లా నేత కాలం నారాయణరెడ్డితో పాటు పలువురు ఉపాధ్యాయులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో ఇరువ ర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకోవడంతో పాటు పలువురు ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు గల్లాలు పట్టుకునే పరిస్థితి ఏర్ప డింది. దీంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నారాయణరెడ్డి తాను కూడా అధ్యక్ష పదవికి పోటీ చేస్తానని ఎన్నికలు నిర్వహించాలని పట్టుబట్టారు. దీంతో సమావేశం మొత్తం రసాభాసగా మారింది. 20 నిమిషాల అనంతరం వాగ్వాదం చోటుచేసుకోవడంతో సమావేశాన్ని అర్థం తరంగా నిలిపివేసిన నాయకత్వం కార్యవర్గం విషయంలో ఏకాభిప్రాయం కోసం చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఫణికుమార్


ఫణికుమార్, జానారెడ్డి

నల్లగొండ రూరల్: నల్ల గొండ జిల్లా పీఆర్‌టీయూ జిల్లా నూతన అధ్యక్షుడిగా ఫణికుమార్, ప్రధాన కార్య దర్శిగా జానారెడ్డి ఎన్నికయ్యారు. నల్లగొండ పట్టణంలోని చిన్న వెంకట్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో పీఆర్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. పీఆర్‌టీయూ రాష్ట్ర అధక్షుడు శ్రీపాల్‌రెడ్డి నల్లగొండ జిల్లా అధక్ష, కార్యదర్శులను నియమిస్తూ నియమాక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

సారూ.. మా పొలాలు ఎండిపోతున్నాయి

● కాల్వలు ధ్వంసమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతుల ఆవేదన


ఇండ్లూరు గ్రామంలో ఎండిపోతున్న వరి పొలం


డి-40 కాల్వ ధ్వంసం చేసిన స్థలంలో ఆందోళన చేస్తున్న రైతులు

తిప్పర్తి, సెప్టెంబరు 22: 'నాటు వేసిన పొలాలు ఎండిపోతున్నాయి. కాపాడండి' అని నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల రైతులు వేడుకుంటున్నారు. ఇరిగేషన్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో అన్నదాతలను ఆవేదన చెందుతున్నారు. కాల్వ ద్వారా సాగునీరు వెళ్తున్నప్పటికీ రైతులు నీటిని ఉపయోగించుకోలేని పరిస్థితి నెలకొంది. నిర్దిష్టమైన ప్లాన్‌తో ఇంజ నీర్‌ల సాయంతో నిర్మించిన సాగునీటి కాల్వలు అనేక చోట్ల ధ్వంసమవు తున్నాయి. అధికారులకు సమాచారం ఇస్తున్నా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పానగల్ ఉదయ సముద్రం నుంచి తిప్పర్తి మండల పరిధిలోని పజ్జూరు, ఇండ్లూరు, తిప్పర్తి గ్రామాల శివార్ల నుంచి సర్వారం గ్రామంతో పాటుగా మాడ్గులపల్లి మండల పరిధిలోని ఇందుగుల గ్రామాల్లోని పలు చెరువులకు నీరు చేరుతుంది. తద్వారా ఇండ్లూరు, తిప్పర్తి గ్రామాలకు సంబంధించి సుమారు మూడు కిలోమీ టర్ల పొడవులో సుమారు 200ల ఎకరాలకు పైగా గతంలో సాగు నీరు అందేదని రైతులు చెబుతున్నారు. ఆగస్టు నెలలో రెండు రోజులపాటు వది లిన కాల్వ నీటితో పాటు ఓ మోస్తారు వర్షాలు రావడంతో రైతులు ఆనం దంలో పొలం దున్ని నాట్లు వేశారు. అనంతరం మరో 15రోజుల తర్వాత ఇండ్లూరు గ్రామ శివారులోని డి-40 కాల్వ, 20-ఎల్ వద్ద దిగువ ప్రాంతం లోని రైతులు ఎక్సకవేటర్‌తో కాల్వ ర్యాంప్‌ను ధ్వంసం చేయడంతో 20ఎల్ ద్వారా సాగుకు నీరు వెళ్లడం లేదు. కాల్వను ధ్వంసం చేసిన వారిని స్థానిక రైతులు అడ్డుకొని పోలీసులకు అప్పగించినప్పటికీ ఇప్పటి వరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా కనీసం ధ్వంసమైన కాల్వను మరమ్మతులు చేయించలేదు. ఇరిగేషన్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే పొలాలకు సాగునీరు అందడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని తిప్పర్తి, మామిడాల, చిన్నాయిగూడెం, మర్రిగూడెం, అంతయ్య గూడెం వంటి పలు గ్రామాల్లో కొంత మంది రైతులు తమ పొలాల్లో ఉన్న సాగునీటి కాల్వలను పారుగంత(చిన్న చిన్న కాల్వలు) పూర్తిగా పూడ్చివేసి సాగు చేసుకోవడంతో కాల్వ ద్వారా వచ్చే నీటిని ఉపయోగించుకోలేక పోతున్నామని దిగివన ఉన్న గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. మండల వ్యాప్తంగా ధ్వంసమైన కాల్వలు పరిశీలించి అధికారులు చర్యలు తీసుకొని సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు. కాల్వలు ధ్వంసమైన విషయంలో సంబంధిత శాఖ మండల, జిల్లా స్థాయి అధికారులను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా స్పందన కరువైంది. ఇరిగేషన్ శాఖ మండల అధికారి ఫోన్ స్విచ్ఆఫ్ ఉండగా జిల్లా స్థాయి అధికారులు ఫోన్‌లో స్పందించడం లేదు.

పొలాలు కాపాడండి



డీ-40 కాల్వలో ఇంజనీర్‌ల ప్లాన్ ప్రకారం నిర్మించిన ర్యాంపును ఎక్సకవేటర్‌తో ధ్వంసం చేయడంతో కాల్వలో వెళ్తున్న నీరు ఆగకుండా వెళ్తున్నాయి. దీంతో మా పొలా లకు చుక్క నీరు చేరడం కష్టతరమైంది. కాల్వలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. తిరిగి నీరు చేరేలా ర్యాంపును నిర్మించాలని అధికారులను కోరుతున్నాం.

● మార్త ఏడుకొండలు ఇండ్లూరు గ్రామ రైతు.

తీసిన షట్టర్ తిరిగి అమర్చిన రైతులు

తిప్పర్తి మండల పరిధిలోని ఎర్రగడ్డలగూడెం గ్రామ సమీపంలో నుంచి వెళ్తున్న డీ-40 సాగునీటి కాల్వ ద్వారా నకిరేకల్ మండల పరిధిలోని లోని గోరెంకలపల్లి గ్రామ రైతులకు సాగునీరు చేరుతుంది. ఈ క్రమంలో డీ-40 కాల్వలో సరిపడా నీరు రాకపోవడంతో 11-ఎల్ తూము ద్వారా గోరెంకలపల్లి గ్రామం వైపునకు వెళ్లే నీరు వెళ్లడం లేదు. ఈ క్రమంలో గోరెంకలపల్లి గ్రామానికి చెందిన స్థానిక రైతులు తమకు సాగునీరు ఎలాగైనా చేరాలనే ఆలోచనతో అక్కడ ఉన్న తూము షట్ట ర్‌ను ట్రాక్టర్‌ల సహాయంతో శనివారం తొలగించారు. విషయం తెలుసు కున్న సంబంధిత అధికారులు తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా తమపై కేసు అవుతుందేమోననే భయంతో అదే రైతులు తిరిగి షట్టర్‌ను అమర్చారు. అధికారులు డీ-40 కాల్వలో సరిపడా నీరు వదలకపోవడం వల్లనే తాము అలా చేయాల్సి వచ్చిందని రైతులు తెలిపారు. అదే విధంగా కాలువలను రైతులు ఇష్టారాజ్యంగా ధ్వంసమైనప్పటికీ ఈ విష యాన్ని అధికారులకు తెలియజేసినప్పటికీ అధికారులు స్పందించడం లేదని పలు గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. సరైన సమయంలో అధి కారులు స్పందించక పోవడంతో కాల్వలు ధ్వంసం చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

గోదాంలకు దారేదీ?

● చిలుకూరులో నిరుపయోగంగా ధాన్యం గోదాంలు ● వినియోగంలోకి తేవాలని రైతుల విజ్ఞప్తి



చిలుకూరులో నిర్మించిన గోదాంలు


చిలుకూరు, సెప్టెంబరు 22: మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులతో నిర్మించిన రెండు ధాన్యం గోదాంలు నిరుపయోగంగా మారాయి.. రైతులు ధాన్యం నిల్వ చేసుకునేందుకు కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులు రూ.2.80 కోట్లతో నాలుగేళ్ల క్రితం ఐదువేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో రెండు గోదాంలను నిర్మించారు. ఈ గోదాంల వద్దకు లారీలు వెళ్లేందుకు సరైన రోడ్డు లేదు. దీంతో ఈ రెండు గోదాంలు ఇప్పటి వరకు వినియోగంలోకి రాలేదు.

రైతులు పండించిన పంటలను కల్లాల్లో తక్కువ ధరకు విక్రయించకుండా ప్రభుత్వ గోదాంలలో నిల్వ చేసుకోవాలంటే గోదాంల వద్దకు వెళ్లడానికి రాది లేదు. దీంతో రైతులు ప్రైవేటు గోదాంలను ఆశ్రయిస్తున్నారు. దీంతో రైతులపై ఆర్థిక భారం పడుతోంది. మార్కెట్ కమిటీ నిధులతో నిర్మించిన గోదాంల్లో ఆరునెలల పాటు ఉచితంగా ధాన్యం నిల్వ చేసుకోవడంతో పాటు నిల్వ చేసిన ధాన్యంపై రైతులు తక్కువ వడ్డీకే రుణాలు పొందవచ్చు.

చర్యలు చేపట్టినా పూర్తికాని పనులు

చిలుకూరు-బేతవోలు రోడ్డు నుంచి గోదాంల వద్దకు రోడ్డును నిర్మించేందుకు ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టినా పనులు పూర్తి కాలేదు. బేతవోలు రోడ్డు నుంచి గోదాంల వద్దకు వెళ్లేందుకు దేవాలయ మాన్యం భూములు అడ్డుగా ఉన్నాయి. ఆ తరువాత కొంతమంది రైతుల భూముల నుంచి గోదాం వరకు రోడ్డును నిర్మించాలని రెండేళ్ల క్రితం ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టారు. అయితే రోడ్డును నిర్మించేందుకు నిధులు లేనందున ఎక్కడ వేసి గొంగళి అక్కడే అన్న విధంగా మారింది. దేవాలయ భూములతో పాటు, రైతుల భూముల నుంచి గోదాం వరకు రోడ్డును ప్రభుత్వం నిర్మించి, కోట్లాది రూపాయలతో నిర్మించిన గోదాంలను వినియోగంలోకి తేవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

గోదాంలను వినియోగంలోకి తీసుకురావాలి



కోట్ల రూపాయల నిధులతో నిర్మించిన గోదాంలకు సరైన దారి సౌకర్యం లేకపోవడం బాధాకరం. రైతులు పండించిన ధాన్యాన్ని వ్యవసాయ మార్కెట్ గోదాంలలో భద్రపర్చేందుకు అవసరమైన రోడ్డును తక్షణమే ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. గోదాంలు అందుబాటులోకి వస్తే రైతులపై ఆర్థికభారం తగ్గుతుంది.

● దొడ్డా వెంకటయ్య, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

హక్కుల సాధనకు నిరంతరం పోరాడేది ఐద్వానే

మునగాల, సెప్టెంబరు 22: మహిళా హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేసేది ఐద్వానే అని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అమవీరుల స్మారక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలపై పెరుగుతున్న హింసను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేశిరెడ్డి జ్యోతి, నాగేశ్వరమ్మ, ఎస్కే ఖాజాబీ, బి.విమల, లింగమ్మ, వెంకటమ్మ, కోటమ్మ, బక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

సతీష్‌కుమార్‌కు జ్యోతిష్య రత్న అవార్డు



జ్యోతిష్య రత్న అవార్డు అందుకుంటున్న సతీష్‌కుమార్

ఆత్మకూర్(ఎస్), సెప్టెంబరు 22: మండలంలోని నెమ్మికల్ గ్రామంలోని శ్రీదండు మైసమ్మ దేవాలయం ప్రధాన అర్చకుడు అబ్బోజు సతీష్‌కుమార్ ఆచార్యులకు ప్రతిష్మాత్మక జ్యోతిష్య రత్న అవార్డు దక్కింది. ఆదివారం తమిళనాడులోని తిరుమన్నామలైలో రెండో అంతర్జాతీయ హిందూ దేవాలయాలు, ఆధ్యాత్మిక జ్యోతిషులు, మతాధిపతుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో సతీష్‌కుమార్ ఆచార్యులకు అవార్డును హిందు దేవాలయల అర్చక సంక్షేమ ట్రస్టు ఫౌండర్, చైర్మన్ డాక్టర్ విశ్వనాథన్ అందజేశారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి సురేష్ తొలగింపు

సూర్యాపేట టౌన్, సెప్టెంబరు 22: సూర్యాపేట లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి గుండు సురేష్‌ను అసోసియేషన్ నుంచి తొలగించామని ఆ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు గండు నర్సింహగౌడ్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి అనంతుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వీరస్వామి, మల్లేష్, రాములు, శ్రీను పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నేరేడుచర్ల, సెప్టెంబరు 22: నేరేడుచర్ల పట్టణంలోని ప్రగతి విద్యాలయంలో 2005-06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భాస్కర్‌రెడ్డి, కరస్పాండెంట్ రంగారెడ్డి, ఉపాధ్యాయులు లింగారెడ్డి, రాంరెడ్డి, పుల్లారెడ్డిపాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు 200రోజులు పని కల్పించాలి

నేరేడుచర్ల, సెప్టెంబరు 22: 'ఉపాధి' కూలీలకు 200రోజులు పని దినాలు కల్పించి రోజుకు రూ.600వేతనం అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నేరేడుచర్లలో ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకాన్ని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో యల్లబోయిన సింహాద్రి, కత్తి శ్రీనివాసరెడ్డి, రావుల సత్యం తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వన భోజనాలు

మేళ్లచెర్వు, సెప్టెంబరు 22: మండల కేంద్రంలో ఆదివారం సామూహిక వన భోజనాల కార్యక్రమంలో నిర్వహించారు. ప్రతి సంవత్సరం వినాయక చవితి, వినాయక విగ్రహాల నిమజ్జనం అనంతర కుల, మతాలకు అతీతంగా సామూహికంగా వన భోజనాలు నిర్వహించటం ఇక్కడ ఆనవా యితీ. ముందుగా గ్రామస్థులు ట్రాక్టర్లు, కార్లలో ర్యాలీగా గ్రామ పొలిమేరలోని గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించారు.

'ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం'

గరిడేపల్లి, సెప్టెంబరు 22: ప్రజా సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి రామ్ సైదులు ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్యారెంటీల హామీలతో ఎన్నికల్లో గెలిచి అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమయ్యారని ఆరోపించారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా 'హైడ్రా' పేరుతో డ్రామాలాడుతున్నారని విమర్శించారు. విష జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు కూడా లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

'లేబర్ బోర్డును ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దు'

సూర్యాపేట టౌన్, సెప్టెంబరు 22: భవన, ఇతర నిర్మాణ కార్మిక శాఖ ద్వారా కార్మికులకు ఇచ్చే లేబర్ ఇన్సూరెన్స్ బోర్డును ఇతర ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వవద్దని తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు తోట శ్రవణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటలో తెలిపారు. కార్మిక వెల్ఫేర్ బోర్డు స్కీంలను ఇన్సూరెన్స్ బోర్డులకు ఇస్తే కార్మికులు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఇన్సూరెన్స్ నిర్వాహకులు సొంత లాభం కోసం చిన్నచిన్న కారణాలను చూపి ఇన్సూరెన్స్ తగ్గించే అవకాశం ఉందన్నారు. లేబర్ డిపార్ట్‌మెంట్ ద్వారా కార్మిక సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు.

సీడ్స్, పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్స్ డివిజన్ కమిటీ ఎన్నిక

తుంగతుర్తి, సెప్టెంబరు 22: తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి సీడ్స్, పెస్టిసైడ్స్ ఫర్టిలైజర్ నూతన డివిజన్ కమిటీని ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన పూసపెల్లి యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన సోమ వెంకన్న, కోశాధికారిగా నూతనకల్ మండల కేంద్రానికి చెందిన సామా నాగిరెడ్డి, ఉపాధ్యక్షులుగా నాగారం మండల కేంద్రానికి చెందిన కల్లెట్లపల్లి శ్రీనివాస్, సూరయ్య (మద్దిరాల), జాయింట్ సెక్రటరీగా కళాబత్తుల శ్రీనివాస్ (జాజిరెడ్డిగూడెం), గౌరవ అధ్యక్షులుగా గుండా ఈశ్వరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. .

ఇద్దరు కార్యదర్శులకు ఎస్‌డబ్ల్యూవో ఉద్యోగాలు



సతీష్



హరికృష్ణ

ఆత్మకూర్(ఎస్), సెప్టెంబరు 22: మండలంలోని గట్టికల్ గ్రామానికి పంచాయతీ కార్యదర్శి కోన సతీష్, నెమ్మికల్ పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్లు(ఎస్‌డబ్ల్యూవో)లుగా ఎంపికయ్యారు. కొద్దిరోజులుగా గ్రూపు-2 పరీక్షలకు సిద్ధమవుతూ టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్లుగా ఎంపికయ్యారు. సతీష్, హరికృష్ణను పలువురు అభినందించారు.

అవయవదానంపై అవగాహన ఉండాలి



అవయవదానంపై అవగాహన కల్పిస్తున్న కన్వీనర్ గంజి ఈశ్వర్

సూర్యాపేట రూరల్, సెప్టెంబరు 22: అవయవదానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని శరీర అవయవదాన ఐక్య వేదిక కన్వీనర్ గంజి ఈశ్వర్ అన్నారు. నేత్ర. శరీర అవయవదాన సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సూర్యాపేటలోని వికాస్ పార్మసీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణించిన వ్యక్తి అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేస్తే మరోకరికి ప్రాణ దానం చేసినట్లేనని అన్నారు. కిడ్నీ, కాలేయం, గుండె, పలు సమస్యలతో లక్షల మంది చనిపోతున్నారని, అవయవ దానం చేస్తే కొంతమందినైనా బతికించవచ్చని అన్నారు. అవయవదానంపై గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం అవయవ దానానికి ముందుకు వచ్చిన 20మందికి సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గుండా రమేష్, డైరక్టర్ కోటయ్య, పిచ్చిరెడ్డి, శ్రవణ్‌కుమార్, లింగమూర్తి, రమణాచారి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బొబ్బా భాగ్యరెడ్డి

హుజూర్‌నగర్, సెప్టెంబరు 22: ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు పేదలకు వివరించాలన్నారు. ప్రతి ఒక్కరూ బూత్‌ల వారీగా సభ్యత్వాలు నమోదు చేయించాలన్నారు. మోదీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బాల వెంకటేశ్వర్లు, శ్రీలతారెడ్డి, వెంకటేశ్వర్లు, అక్కిరాజు యశ్వంత్, సాయి, ఇంటి రవి, అంబళ్ల నరేష్, గుండెబోయిన వీరబాబు, రామరాజు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ గుడి నిర్మాణానికి సహకరించాలి



ఎమ్మెల్యే సామేలును కలిసిన కొమ్మాల గ్రామస్థులు

అర్వపల్లి, నూతనకల్, సెప్టెంబరు 22: జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాల గ్రామంలోని ఎస్సీ కాలనీలో ముత్యాలమ్మ గుడి నిర్మాణం కోసం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలును గ్రామస్థులు ఆదివారం కలిశారు. గుడి నిర్మాణానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూరారపు వెంకట్రాది, గంగాదరి శ్రీనివాస్, సైదులు, అర్జున్, శ్రీరాములు, శ్రీను, పరమేష్, వెంకన్న పాల్గొన్నారు.

●నూతన్‌కల్ మండలంలోని మిర్యాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మందుల సామేలును ఆదివారం హైదరాబాద్‌లో కలిశారు. గ్రామ శివారులో తెగిన కుంట కట్టకు మరమ్మతులు చేయిం చాలని కోరారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో మెంచు చక్రయ్య, దరిపెల్లి వీరన్న, అనంతుల శ్రీనివాస్, గోరుగంటి రాంచందర్‌రావు, ఇరుగు కిరణ్, గునగంటి వెంకన్న, వెంకటమల్లు తదితరులు ఉన్నారు.

వర్తక సంఘం నాయకుడు కాళేశ్వరరావు మృతి

హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబరు 22: పట్టణానికి చెందిన వర్తక సంఘం నాయకుడు చిత్రపు కాళేశ్వరరావు(75) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. కొద్ది రోజుల క్రితం ఆయనకు గుండె ఆపరేషన్ జరిగింది. మరో సారి గుండెపోటు రాగా, ఆయనను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాళేశ్వరరావు భార్య, ఇద్దరు కుమారులు ఉండగా, లండన్‌లో ఉన్న పెద్ద కుమారుడు గత ఏడాది ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఆయన మృతికి ఆర్యవైశ్య సంఘం నాయకులు ఓ. నర్సింహారావు, పొలిశెట్టి నర్సింహారావు,నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్ సంతాపం తెలిపారు.

'పేరును తొలగించడం సరికాదు'

హుజూర్‌నగర్, సెప్టెంబరు 22: హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి ఉన్న పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం సరైన విధానం కాదని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మాశెట్టి అనంతరాములుగుప్తా అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయానికి ఉన్న పేరును తొలగించి మరో పేరు పెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. తెలుగు భాషా సంయుక్త రాష్ట్రాల కోసం ఆత్మబలిదానం చేసిన పొట్టి శ్రీరాములు త్యాగం వెలకట్టలేనిదని అన్నారు.. తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగించి సురవరం ప్రతాప్‌రెడ్డి పెట్టాలని నిర్ణయించడం, ఈ విషయమై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకో వడంపై తెలంగాణ రాష్ట్రంలోని ఆర్య వైశ్యుల తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

అభయాంజనేయస్వామి

దేవాలయ చైర్మన్‌గా సైదులునాయక్

చివ్వెంల, సెప్టెంబరు 22: మండలంలోని సూర్యనాయక్‌తండాలోని అభయాంజనేయస్వామి దేవాలయ కమిటీ నూతన చైర్మన్‌గా దరావత్ సైదులునాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవాలయ కమిటీ సభ్యులుగా దరావత్ జానునాయక్, సంజీవ,సుధాకర్‌నాయక్, నరేష్‌నాయక్, రమేష్‌నాయక్‌ను నియమించారు.

మండల వాసికి డాక్టరేట్



చిలుకూరు, సెప్టెంబరు 22: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కొండా విజయ్‌కుమార్ ఓయూ నుంచి డాక్టరేట్ సాధించారు. ఉస్మానియా యూనివర్సిటీలోని తెలుగు శాఖలో తెలంగాణ సాయుధ పోరాటంలో 'నల్లగొండ కవుల పాత్ర' అనే అంశంపై ప్రొఫెసర్ తూర్పు మల్లారెడ్డి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు ఆయనకు డాక్టరేట్ లభించింది. విజయ్‌కుమార్ ప్రస్తుతం రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

సొంత ఖర్చుతో రోడ్డుకు మరమ్మతులు

మఠంపల్లి, సెప్టెంబరు 22: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని మంచ్యాతండాలో దుప్పలగట్టు మైసమ్మ దేవాలయం రోడ్డు దెబ్బతింది. దీంతో మంచ్యాతండా నుంచి గుట్టపై వెళ్లే రోడ్డులోరాకపోకలు సాగించడానికి భక్తులు ఇబ్బంది పడుతున్నారు. గ్రాయ యువజన కాంగ్రెస్ నాయకుడు మాలోతు బాలునాయక్ ఆధ్వర్యంలో యువజన సంఘం సభ్యులు ఆదివారం తమ సొంత ఖర్చుతో రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

నూతన్‌కల్, సెప్టెంబరు 22: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన ఆత్మకూరు(ఎస్) మండల విలేకరిబోయిల్ల చంద్రశేఖర్ కుటుంబ సభ్యులకు ఆ మండలానికి చెందిన పత్రికా విలేకరులు రూ.1.08 లక్షల ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరితో కలివిడిగా ఉండే శేఖర్ మృతి బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. సాయం అందించినవారిలో భూపతి రాములు, జలగం మల్లేష్, జంగా జానయ్య, మడ్డి మల్లేష్, సుందర్, సైదులు, మేడి కృష్ణ, జిల్లా రాములు, సైదులు తదితరులు ఉన్నారు.

గ్రామాభివృద్ధికి యాదమ్మ కృషి



రాయినిగూడెంలో యాదమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సూర్యాపేటరూరల్, సెప్టెంబరు 22: మండలంలోని రాయినిగూడెం గ్రామాభివృద్ధికి మాజీ సర్పంచ్ ఎల్గూరి యాదమ్మ ఎనలేని కృషి చేశారని ఆ గ్రామ కాంగ్రెస్ నాయకులు అన్నారు. యాదమ్మ దశ దిన కర్మ సందర్భంగా ఆదివారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎల్గూరి వెంకటేషం, ఎలగబోయిన మధుయాదవ్, వీరయ్యగౌడ్, సైదులు, ఉపేందర్, మదార హుస్సేన్, సైదులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

సూర్యాపేట అర్బన్, సెప్టెంబరు 22: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని గ్రీన్‌క్లబ్ ట్రస్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముప్పారపు నరేందర్, తోట కిరణ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించి భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీవీసీ పరిశ్రమల అధినేత మీలా మహదేవ్, సభ్యులు శశిధర్, కృపాకర్, నాగేశ్వర్‌రావు, ప్రకాష్, లక్ష్మీకాంత్, కమలాకర్, వెంకటేశ్వర్లు, శ్రవణ్, లక్ష్మీనారాయణ పాపిరెడ్డి, బాస్కరాచారి, చంద్రశేఖర్, వేణుమాదవ్, ఉపేందర్, మల్లికార్జున్, సాయిరెడ్డి, విద్యాసాగర్‌రావు, రమేష్, శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, ఉపేందర్, బాలకృష్ణ, చలపతిరావు, శ్రీదేవి, పద్మ, హేమమాలిని పాల్గొన్నారు.


రక్షణ లేకుండా కందకం



తిరుమలగిరి క్రీడా ప్రాంగణంలో రక్షణ లేకుండా ఉన్న భారీ కందకం

అమృత్ పథకంలో భాగంగా తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలోని పీహెచ్‌సీ క్రీడా ప్రాంగణంలో ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణం కోసం భారీ గుంతను తీసి మధ్యలో పని ఆపేశారు. గుంత చుట్టూ ఎలాంటి రక్షణ ఏర్పాట్లు చేయలేదు. పాఠశాల విద్యార్థులు ఈ గుంత ప్రాంతంలో ఉదయం, సాయంత్రం వేళల్లో ఆటలాడుకుంటారని స్థానికులు చెబుతున్నారు. నిత్యం ఈ రోడ్డు నుంచి 100 మంది విద్యార్థులు హాస్టళ్ల నుంచి పాఠశాలకు వెళుతుంటారని చెబుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగక ముందే రక్షణ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

● తిరుమలగిరి



సూర్యాపేట రూరల్: మండలంలోని కాసరబాద రోడ్డులో ఉన్న అపూర్వ బదిరుల పాఠశాలలో ఆరో తరగతి అదనపు గదులను ఎస్ఐఆర్డీ ప్రెసిడెంట్ సుదర్శన్, వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వర్‌రావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిరుల విద్యార్థులను అక్కున చేర్చుకుని విద్యాబుద్ధులు నేర్పించడం చాలా సంతోకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం, లక్ష్మాచారి, సైదాచారి, శ్రీనివాస్, జాన్‌కుమార్, సరిత, కరస్పాండెంట్ మదనాచారి పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: రైతులకు వానాకాలం సీజన్‌కు పంట రుణాలు అందజేస్తామని పీఏసీఎస్ ఛైర్మన్ ఊరె రాధాకృష్ణ, చీకూరి లింగయ్య తెలిపారు. ఆదివారం వేపలసింగారంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతులు ఈ నెల 30వ తేదీ వరకు రుణాలు పొందవచ్చన్నారు. గతంలో రుణాలు తీసుకున్న రైతులతో పాటు కొత్తగా రైతులు కూడా రుణాలు పొందవచ్చన్నారు. అలాగే దీర్ఘకాలి రుణాలను సంఘం ద్వారా అందిస్తామన్నారు. ఈ సమావేశంలో నాగరాజు, మల్లారెడ్డి పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్‌పట్టణంలోని లింగగిరి రోడ్డులో శ్రీనగర్ కాలనీ ముఖద్వారం వద్ద ఆర్చీని నిర్మించాలని కాంగ్రెస్ నాయకుడు అట్లూరి హరిబాబు, సిటీ కేబుల్ ఎండీ శాఖమూరి రవికుమార్ కోరారు. ఆదివారం పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో స్థానిక ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఆర్చీ నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. మునిసిపల్ కమిషనర్ నుంచి అనుమతులు తీసుకుని ఆర్చీని నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి, రాము, నాగేశ్వరరావు, రంగా, పవన్, సాయికుమార్, శ్రీనివాస్, రమేష్, నజీర్, సలీం పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్ మండలంలోని మండల గోపాలపురం గ్రామంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో రేకుల షెడ్డు నిర్మాణానికి 18వ వార్డు కౌన్సిలర్ కుంట ఉపేంద్రసైదులు రూ.10వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అళహరి నర్సింహాచార్యులు, అన్వేష్‌కుమారాచార్యులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఎస్‌డీ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, ఏఐటీయూసీ కార్మికుల సంక్షేమానికి కృషి చేసిన కోమూరి అప్పారావు మృతి కార్మిక రంగానికి తీరని లోటని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని శ్రీరంగాపురంలో అప్పారావు మృతదేహానికి నివాళులర్పించి మాట్లాడారు. అప్పారావు అంతిమ యాత్రలో మునిసిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి షేక్ లతీఫ్, కాంగ్రెస్ పట్టణ నాయకులు శివయ్య, సీపీఐ డివిజన్ కార్యదర్శి రమేష్, మోషిన్, సతీష్, రాజు పాల్గొన్నారు.

సూర్యాపేట అర్బన్, కోదాడ టౌన్: వీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలను అక్టోబరు 24వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కొప్పుల రంగారెడ్డి, రాయపూడి వెంకటేశ్వర్లు, తెలిపారు.ఈ ఉత్సవాలను విజయవంతం చేయా లని కోరుతూ జిల్లా కేంద్రంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో కోదాడ ఎంఎస్ జూనియర్ కళాశాల ఆవరణలో లోగోను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్ర మంలో చిన్ని, ముత్తవరపు పాండురంగారావు, రామవరెడ్డి, నాగిరెడ్డి, లింగంపల్లి భద్రయ్య, మండారి డేవిడ్‌కుమార్, బద్దం అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

చిలుకూరు: మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు వేనేపల్లి వెంకటేశ్వరరావు అనారోగ్యానికి గురికావడంతో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పరామర్శించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జె.నర్సింహారావు సూచించారు. ఆదివారం మండలంలోని ఆచార్యులగూడెంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యావసర ధరలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. అనంతరం సీపీఎం గ్రామశాఖ కార్యదర్శిగా గట్టు లింగయ్యను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీగటి రాములు, పిల్లి వీరమల్లయ్య, చంద్రయ్య, సురేష్, సైదులు, నాగేశ్వరరావు, లక్ష్మిపాల్గొన్నారు.

మునగాల రూరల్: నడిగూడెం, మునగాల మండల కేంద్రాల్లోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సహాయ వంట మనుషులు, స్వీపర్ పోస్టులకు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో సలీం షరీఫ్ కోరారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ మునగాలలో సహాయ వంట మనిషి, స్వీపర్/స్కావెంజర్ పోస్టు, నడిగూడెంలో సహాయ వంట మనిషి పోస్టుకు ఈ నెల 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18-45 సంవత్సరాల లోపు వయసు, ఏడో తరగతి విద్యార్హత కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను స్థానిక మండల విద్యావనరుల కేంద్రలో అందజేయాలన్నారు

మద్దిరాల: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాల్లో పని చేయుటకు మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో స్థానికత కలిగిన 18-45ఏళ్ల లోపు వయసు కలిగిన మహిళలు, దరఖాస్తులను కేజీబీవీ కార్యాలయంలో ఎస్‌వోకు ఈ నెల 25వ తేదీ లోపు అందజేయాలన్నారు.అసిస్టెంట్ కుక్ మూడు, స్వీపర్ 1, స్కావెంజర్ 1, డే వాచ్‌మెన్ ఒకటి ఉన్నాయన్నారు.

మునగాల రూరల్: పటాన్‌చెరువులో ఈ నెల 24వ తేదీన జరిగే రేషన్ డీలర్ల రాష్ట్ర భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని డీలర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొల్లపూడి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రేషన్ డీలర్లకు రూ.5 వేల గౌరవ వేతనం, కమీషన్ రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

తిరుమలగిరి: తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో అండర్ పాస్ నిర్మించొద్దంటూ అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని అఖిలపక్ష నాయకులు కొమ్మినేని సతీష్‌కుమార్ కోరారు. మునిసిపల్ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన అఖిలపక్ష నాయకుల సమావేశంలో మాట్లాడారు. అండర్‌పాస్ నిర్మిస్తే చిన్న, మధ్య తరగతి వ్యాపారులు ఉపాధి కోల్పోతారన్నారు. ఈ కార్యక్రమంలో మూల రవీందర్ రెడ్డి, సంకెపల్లి కొండల్‌రెడ్డి, బత్తుల శ్రీను, కొత్తగట్టు మల్లయ్య, గుండ భాస్కర్, శేఖర్, సోమన్న పాల్గొన్నారు.